పది మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న ఆర్జెడి ప్రతాపరెడ్డి

వార్షిక విత్తన ప్రణాళిక సిద్ధం

మన విత్తనం ఇక లేనట్టేనా .?

వార్షిక విత్తన ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ జిల్లాకు ఎంత విత్తనాలు అవసరమన్నది అంచనా వేసింది. ఈ మేరకు ఆయా సీజన్‌లో విత్తన కేటాయింపులను ఖరారు చేసింది. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ప్రధానమైన పంట వేరుశనగ. ఈ పంటకు సంబంధించి కూడా రెండు జిల్లాలకు విత్తన కేటాయింపులను ఖరారు చేసింది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విత్తన కేటాయింపులకు సంబంధించి అనంతపురం జిల్లాకు 78,245 క్వింటాళ్ల కేటాయించగా, సత్యసాయి జిల్లాకు 100907 క్వింటాళ్ల కేటాయించింది. రెండు జిల్లాలకు కలిపి 1,79,152 క్వింటాళ్ల కేటాయించింది. గతేడాది కూడా ఇదే రకమైన కేటాయింపులు జరిగాయి. అయితే ఈ విత్తనకాయలు కూడా తీసుకోవడానికి రైతులు ముందుకు రాకపోవడం గమనార్హం. అయితే ఈ విత్తన సేకరణకు సంబంధించి ఇప్పటి వరకు సేకరణ ధర ఖరారవలేదు. సేకరణ ధర ఖరారు తరువాత సబ్సిడీ ధర ఎంతన్నది తేలే అవకాశముంది. సాధారణంగా జిల్లాలో మే నెలలో ఖరీఫ్ వేరుశనగ విత్తన కాయఘ పంపిణీ ప్రారంభమవుతుంది. అంతలోపు అంటే ఈ నెలాఖరులోపు విత్తన సేకరణకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాల్సి ఉంటుంది. వేరుశనగతోపాటు వరి 1500 క్వింటాళ్ళ, కందులు 4300 క్వింటాళ్ళ, ఉలవలు 825 క్వింటాళ్ళ, పిల్లిపెసర, అలసందలు, ఇతరములన్నీ కలిపి అనంతపురం జిల్లాకు ఖరీఫ్‌కు 85,322 క్వింటాళ్ల కేటాయించింది. ఇక సత్యసాయి జిల్లాకు వంద క్వింటాళ్ల కందులు, 50 క్వింటాళ్ల రాగి ఇతరములన్నీ కలిపి 1,01,141 క్వింటాళ్ల కేటాయించారు.

రబీ కేటాయింపులు ఇలా...

రబీ సీజన్‌కు ఇప్పుడే విత్తన కేటాయింపులు ఖరారు చేశారు. అనంతపురం జిల్లాలో రబీలో 24,700 క్వింటాళ్ల పప్పుశనగ, 200 క్వింటాళ్ల ఉలవలు, 6,799 క్వింటాళ్ల వేరుశనగ, ఇతర పంటలన్నీ కలిపి 31,736 క్వింటాళ్ల రబీకి కేటాయించారు. 500 క్వింటాళ్ల వరి, 1350 క్వింటాళ్ల పప్పుశనగ, 8223 క్వింటాళ్ల వేరుశనగ, మొత్తం 10,083 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన కేటాయింపులు రబీకి చేశారు. వీటిని అక్టోబరు మాసం తరువాత పంపిణీ చేస్తారు.

మన విత్తనం లేనట్టేనా ?

ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేసే వేరుశనగ విత్తనకాయలు బయట వ్యాపారుల నుంచి సేకరిస్తుండటతో నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ సీడ్ విత్తనం పేరుతో సరిగాలేనివి కూడా పంపిణీ చేసినట్టు గతంలో విజిలెన్సు ఇతర శాఖల విచారణలోనూ తేలింది. దీంతో నాణ్యతమైన విత్తనం కనీసం 25 శాతమైనా ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో మన విత్తనం...సొంత విత్తనం పేరుతో రబీలో కొంత మంది రైతులకు విత్తనకాయలను అందజేసి ఖరీఫ్‌లో దాన్ని సేకరించి ఇవ్వాలని నిర్ధేశించడం జరిగింది. ఇందుకు అనుగుణంగా ఎపి సీడ్స్ శాఖకు బాధ్యతలు అప్పగించేవారు. ఆ శాఖ సర్టిఫైడ్ సీడ్‌ను రైతుల ద్వారా పండించి ఖరీఫ్‌లో వారి నుంచి సేకరించి విత్తనకాయలుగా పంపిణీ చేసేవారు. కాని ఈ ఏడాది రబీలో అటువంటి ప్రక్రియ ఏదీ జిల్లాలో జరగలేదు. దీంతో మొత్తం విత్తనకాయలను ప్రయివేటు వ్యాపారుల నుంచే కొనుగోలు చేయాలన్న ఆలోచనలో ఆ శాఖ ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రైతులు నాణ్యమైన విత్తనం దొరక్క ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం పూర్తిగా సర్టిఫైడ్ సీడ్‌నే సేకరించే పరిస్థితి లేకుండా మొత్తం ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ పేరుతో దొరికిన విత్తనాన్ని రైతులకు అంటగట్టే పరిస్థితి ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

'పది'లో మెరుగైన ఫలితాలు వస్తాయి..

♦ మేలో ఫలితాలు వచ్చే అవకాశం ♦ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఈ సారి పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గతం కంటే మెరుగ్గా ఉంటుందని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అనంతపురం కెఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది మూల్యాంకన కేంద్రాన్ని డిఇఒ ఎం.సాయిరామ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పది మూల్యాంకనం సజావుగా జరుగుతోందని చెప్పారు. ఉపాధ్యాయులకు కావాల్సిన వసతులు అన్నీ కల్పించామని చెప్పారు. మూల్యాంకనం విధులకు వచ్చిన ఉపాధ్యాయులు అందరూ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఈసారి పదో తరగతి పరీక్షల ఫలితాలు గ్రేడ్ రూపంలో కాకుండా మార్కుల రూపంలో వస్తాయన్నారు. ఫలితాలు ఎప్పుడు విడుదల చేస్తారన్నది ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. మే నెలలో వచ్చే అవకాశం ఉందన్నారు. వేసవి సెలవుల్లో 98 డీఎస్సీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిలు ప్రసాద్, గోవిందనాయక్, డిప్యూటీ డీఈవోలు పద్మప్రియ, శంకర పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు ఏర్పాటు

ప్రస్తుతం ఎండలు ఎక్కువుగా ఉన్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ప్రత్యేక చొరవ తీసుకుని మూల్యాంకనం కేంద్రంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయించారు. ఈ మెడికల్ క్యాంప్‌ను డీఈవో పరిశీలించారు. ఏఏ మందుకులు అందుబాటులో ఉంచారన్న విషయాన్ని వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై మే 24న గుంటూరులో ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్‌లు, మినీ వర్కర్స్ ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ మే 24వ తేదీన గుంటూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. గురువారం గణేనాయక్ భవన్‌లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కోశాధికారి జమున హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ గౌరవాధ్యక్షులు నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ మేడే కార్యక్రమంలో అంగన్‌వాడీలందరూ పాల్గొనాలని, అన్ని మండలాల్లో కార్మికుల జెండా ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించేలా మే 24 నుంచి ఆందోళనలు చేపడుతునట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్‌కు కనీస వేతనాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదని చెప్పారు. పర్యవేక్షణ పేరుతో వేధింపులూ అధికం అయ్యాయన్నారు. ఈ సమస్యల పరిస్కారానికి పోరాటాలే మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పది ప్రాజెక్టుల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

సవాళ్లు... ప్రతిసవాళ్లు..!

ఎన్.హనుమాపురంలో కాలవ శ్రీనివాసులును బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

♦ కాపు వర్సెస్ కాలవ

♦ ఎన్.హనుమాపురం వేదికగా బహిరంగ చర్చకు సిద్ధం

♦ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అరెస్టు

ప్రజాశక్తి-కణేకల్లు

రాయదుర్గం రాజకీయాలు వేడెక్కాయి. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగిదంటే.. తమ ప్రభుత్వంలోనే జరిగిదంటూ టిడిపి, వైసిపి నేతలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తున్నారు. నియోజకవర్గం అభివృద్ధి పేరుతో అధికారపార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి, రాయదుర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాలవ శ్రీనివాసులు మధ్య కొన్ని రోజులుగా మాటల యుద్ధం నడస్తోంది. దీంతో ఈ ప్రాంతంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

ఎన్.హనుమాపురం వేదికగా నేతల సవాళ్లు..

కణేకల్లు మండల పరిధిలోని ఎన్.హనుమాపురం పంచాయితీ అభివృద్ధిపై ఇటీవల ఈ రెండు పార్టీల నేతల మధ్య సవాళ్లు నడుస్తున్నాయి. హనుమాపురం పంచాయతీ వేదికగా గురువారం నాడు బహిరంగ చర్చకు ఇద్దరు నాయకులు సిద్ధమయ్యారు. ఇటీవల హనుమాపురం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. హనుమాపురం గ్రామం అభివద్ధిపై కాపు మాట్లాడుతూ టిడిపి హయాంలో కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉన్నప్పుడు ఏం అభివద్ధి చేశారో చెప్పాలంటూ ప్రశ్నించారు. ఆ పార్టీ చేసిన అభివృద్ధిపై గురువారం నాడు గడపగడపకూ వెళ్లి ప్రజలను కనుక్కొద్దామని కాలవకు సవాల్ విసిరారు. దీనికి ప్రతిగా కాలవ శ్రీనివాసులు స్పందించారు. హనుమాపురం గ్రామ అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధమని, గురువారం నాడు ఆ గ్రామానికి వస్తానంటూ ప్రతిసవాల్ విసిరారు. దీంతో రెండు పార్టీల మధ్య అగ్గిరాజుకుంది.

కాపు సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పి కాలవ శ్రీనివాసులు గురువారం మధ్యాహ్నం ఎన్.హనుమాపురం గ్రామానికి చేరుకున్నారు. ఆయనకు మద్దతుగా రాయదుర్గం నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు కూడా అక్కడికి వచ్చారు. ఇదే సమయంలో సవాల్ విసిరిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కూడా హనుమాపురం గ్రామానికి రాయదుర్గం నుంచి బయల్దేరారు.

అడ్డుకున్న పోలీసులు... కాలవ అరెస్టు..

కాపు, కాలవ మధ్య సవాళ్ల పర్వాన్ని గుర్తించిన పోలీసులు అప్రమత్తం అయ్యారు. కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు హనుమాపురం గ్రామానికి చేరుకున్నారు. టిడిపి కార్యకర్తలతో కలిసి హనుమాపురం గ్రామంలో ఉన్న కాలవ శ్రీనివాసులును బలవంతంగా అరెస్టు చేసి కళ్యాణదర్గం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇక హనుమాపురం గ్రామానికి వస్తున్న కాపు రామచంద్రారెడ్డిని బొమ్మనహాల్ పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల నేపథ్యంలో హనుమాపురం వెళ్లేందుకు వీల్లేదంటూ ఆయనకు నచ్చజెప్పి అక్కడి నుంచి వెనక్కు పంపారు. ఇలా అధికార, ప్రతపక్ష పార్టీ నేతల మధ్య చోటు చేసుకున్న ఈ వివాదంతో హనుమాపురం గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గరయ్యారు.

కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్‌కు తరలింపు..

కళ్యాణదుర్గం : ఎన్.హనుమాపురం గ్రామం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులను పోలీసులు అరెస్టు చేసి గురువారం మధ్యాహ్నం కళ్యాణదుర్గం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఉంచారు. డీఎస్పీ శ్రీనివాసులు కాలువను ముందస్తుగా అరెస్టు చేసి కళ్యాణదుర్గం పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో స్థానిక టీడీపీ శ్రేణులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్‌చౌదరి, వైపీ.రమేష్ మారుతీచౌదరి, ఆర్జీ శివశంకర్ తదితరులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అనంతరం సిఐ తేజమూర్తి సొంతపూచీకత్తుపై కాలవ, నాయకులను విడుదల చేశారు.

'పురం'లో సినిమా రాజకీయం

♦ 'వీరసింహారెడ్డి' చిత్రం చుట్టూ పొలిటికల్ ఫైట్

♦ శతదినోత్సవ వేడుకల నిర్వహణకు బాలయ్య అభిమానుల పట్టు

♦ అనుమతులు నిరాకరించిన మున్సిపల్ అధికారులు

♦ కార్యాలయం ముందు 3గంటల పాటు రాస్తారోకో

హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేస్తున్న బాలకృష్ణ అభిమానులు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో రాజకీయ కాక వేడిపుట్టిస్తోంది. ఈ సారి వివాదం వీరసింహారెడ్డి చిత్రం చుట్టూ తిరుగుతోంది. సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ నటించిన వీర సింహారెడ్డి సినిమా శతదినోత్సవ వేడుకలను శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో నిర్వహించడానికి టిడిపి నాయకులు, బాలయ్య అభిమానులు సిద్ధమయ్యారు. వేడుకలను నిర్వహించేందుకు పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న ఎంజిఎం మైదానం ఇవ్వాలని బాలయ్య అభిమానులు ఈ నెల 17వ తేదీన పురపాలక సంఘం అధికారులను రాతపూర్వకంగా కోరారు. గత నాలుగు రోజులుగా అనుమతుల కోసం పురపాలక సంఘం కార్యాలయం చుట్టూ తిరిగారు. మున్సిపల్ అధికారులు అనుమతులను నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన అభిమానులు, టిడిపి నాయకులు నిరసనకు సిద్ధం అయ్యారు. బుధవారం నాడు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అయినప్పటికీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో మరింత ఆగ్రహంతో మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న ప్రధాన రహదారిపై మండుటెండల్లో మూడు గంటలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం, ఎమ్మెల్సీ, ఛైర్‌పర్సన్, కమిషనర్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓ వైపు నిరసనలు జరుగుతుండగానే టిడిపి ముఖ్య నాయకులు, పట్టణ సిఐలు ఈరన్న, వెంకటేశ్వర్లు సమక్షంలో మున్సిపల్ అధికారులతో రెండుసార్లు చర్చలు జరిపారు. అయినప్పటికీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఆనంద్ కుమార్ అనుమతులు ఇవ్వడానికి సాధ్యం కాదని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ సెలవులో ఉన్నారని, ఇన్‌ఛార్జి కమిషనర్‌గా తాను అనుమతి ఇవ్వడానికి వీలు లేదంటూ వారికి తెలిపారు. దీంతో బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు అనుమతులు మంజూరు చేయాలంటూ రోడ్డుపై బైటాయించారు. మూడు గంటల పాటు రాస్తారోకో జరగడంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వేడుకలు నిర్వహించేందుకు ఎంజీఎం మైదానం ఇవ్వడానికి సాధ్యం కాదని విషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంజిఎం హై స్కూల్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించడానికి అనుమతి లేదంటూ ఇన్‌ఛార్జి కమిషనర్ ఆనంద్ కుమార్ లిఖితపూర్వకంగా ఇచ్చారు. అనంతరం వారు ఆందోళన విరమించారు.

వేడుకలను నిర్వహించి తీరుతాం

బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు

బాలకృష్ణ నటించిన వీరసంహారెడ్డి సినిమా శతదినోత్సవ వేడుకలను హిందూపురంలో నిర్వహించి తీరుతామని టిడిపి నాయకులు, బాలయ్య అభిమానులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, బాలకష్ణ అభిమానుల సంఘం జాతీయ కన్వీనర్ నంబూరి సతీష్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, సీనియర్ నాయకులు నాగరాజులు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంజీఎం మైదానం ఇచ్చేందుకు కావాలనే అభ్యంతరాలు సృష్టిస్తున్నారని చెప్పారు. ఒక వేళ ఆ ప్రాంతంలో అనుమతి ఇవ్వకున్నా శత దినోత్సవ వేడుకలను అనుకున్న సమయానికి హిందూపురంలోనే మరో ప్రాంతంలో కచ్చితంగా నిర్వహిస్తామని చెప్పారు. వేడుకల కోసం మైదానం ఇవ్వమని అంటున్న అధికారులు గత పది రోజుల క్రితం వైసీపీ ప్రభుత్వం ఆసరా కార్యక్రమం చేసినప్పుడు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. స్థానిక శాసన సభ్యులు బాలకష్ణ నిర్వహించే కార్యక్రమానికే మున్సిపల్ అధికారులు ఇలా చేస్తే సామాన్యులకు సుపరిపాలన ఎలా అందిస్తారన్నారు. మున్సిపల్ అధికారులు నిరాకరించిన లేఖ ద్వారా కోర్టుకు వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలకష్ణ అభిమాన సంఘం నాయకులు హెచ్ఎన్.రాము, కౌన్సిలర్‌లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, లీగల్ సెల్ కన్వీనర్ శివకుమార్, టిడిపి నాయకులు అమర్నాథ్, నజీర్, మోద శివకుమార్, చంద్రశేఖర్, రామాంజినమ్మ, పరిమళ, వెంకటేష్, బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఫైబర్ సిలిండర్ల వినియోగం సురక్షితం

గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న శ్రీ దేవి ఎంటర్‌ప్రైజస్ సిబ్బంది

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గతంలో ఉపయోగించే సిలిండర్ల స్థానంలో ప్రస్తుతం ఫైబర్ సిలిండర్లు వచ్చాయని, వీటి వాడకం సులభతరంతో పాటు సురక్షితమని శ్రీదేవి ఎంటర్‌ప్రైజస్ (ఇండియన్ గ్యాస్) మెకానిక్ ప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఆత్మకూరు వీధిలో గురువారం నాడు శ్రీదేవి ఎంటర్‌ప్రైజస్ ఆధ్వర్యంలో వంట గ్యాస్ వాడకంపై సేఫ్టీ క్లీనిక్ కార్యక్రమం నిర్వహించారు. ఫైబర్ సిలిండర్లు 15 కిలోల బరువు ఉండడంతో గృహిణులు సులువుగా ఉపయోగించ వచ్చన్నారు. ఫైబర్ సిలిండర్ల ద్వారా ప్రమాదాలకు ఆస్కారం తక్కువగా ఉంటుందన్నారు. ఒక వేళ అనుకోని ప్రమాదం జరిగినప్పటికీ నష్ట ప్రభావం తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం వంటగ్యాస్ ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గ్యాస్ వద్ద వంటచేసే సమయంలో మొబైల్ ఫోన్‌లో మాట్లాడరాదన్నారు. సిలిండర్‌ను నిలువుగా ఉంచాలన్నారు. వంట గదిలో దీపాలు, కట్టెల పొయ్యి ఉండరాదన్నారు. గ్యాస్ సంబంధిత సమస్యలకు రాయదుర్గం శ్రీదేవి ఎంటర్‌ప్రైజస్ గ్యాస్ ఆఫీస్ 9490765454, లేదా 1906 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ సిబ్బంది అల్లాదాదా పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి ఉరవకొండ సమస్యలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరెడ్డి కలెక్టర్ ఎమ్.గౌతమిని కోరారు. ఈ మేరకు గురువారం నాడు కలెక్టర్ ఛాంబర్‌లో ఆమెను కలిసి సమస్యల పరిష్కారంపై వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో 600 మంది ఇళ్ల పట్టాల పంపిణీ కోర్టు కేసుల కారణంగా ఆగిపోయిందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయాలని కోరారు. మండలంలోని హెచ్చెల్సీ నుంచి పిఎబిఆర్‌కు వెళ్లే లింక్ కెనాల్ శిథిలావస్థకు చేరుకుందని, దీని ఆధునీకరణ పనులు చేపట్టాలన్నారు. ఉరవకొండ పట్టణంలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉదిరిపికొండ పైపులైను పనులను ప్రారంభించాలన్నారు. పట్టణంలో ఒక అదనపు సంపు నిర్మాణం చేయాలన్నారు. వజ్రకరూరు, బెలుగుప్ప, కూడేరు మండలాల్లో అటవీ భూములు సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం-2006 కింద వ్యక్తిగత హక్కులు కల్పించి, సాగు పట్టాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. రాకెట్ల-ఆమిద్యాల లిఫ్ట్ నిర్మాణానికి 70 ఎకరాల భూములిచ్చిన రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.8.40 కోట్ల పరిహారాన్ని విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల, కూడేరు మండలంలోని కమ్మూరు, పి.నారాయణపురం, మరుట్ల మూడవ కాలనీ గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించాలన్నారు. ఎంఎం హళ్లి గ్రామానికి పైపులైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కరుట్లపల్లి గ్రామం చెరువు కట్టను భద్రం చేయించి, కట్ట వెడల్పు పెంచాలన్నారు.

అనంత జెఎన్‌టియు పరిధిలో పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన వివిధ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెసీ నాలుగవ సెమిస్టర్ (ఆర్-20) రెగ్యులర్, ఎంబీఏ ఒకటవ సెమిస్టర్(ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్-17, ఆర్-20) సప్లిమెంటరీ, ఎంసీఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ప్రీ పిహెచ్‌డి వింటర్ సెషన్ (2021 అడ్మిషన్ బ్యాచ్) మార్చి 2023 సంవత్సరంలో నిర్వహించిన పరీక్ష పలితాలు విడుదల అయ్యాయన్నారు. పరీక్షా పలితాల కోసం http://jntuaresults.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

అనంతపురం : అనంతపురం సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అరవింద నగర్‌లోని మసీద్‌లో ఇఫ్తార్ విందును గురువారం ఏర్పాటు చేశారు. సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్ట్ సిబ్బంది నారాయణ నాయక్, డా॥మురళీధర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించొద్దని నగర మేయర్ మహమ్మద్ వసీం సిబ్బందికి సూచించారు. నగరంలోని 48వ డివిజన్‌లో గురువారం మేయర్ మహమ్మద్ వసీం పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లాప్ కార్యక్రమాన్ని నగరంలో పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని ఆ దిశగా సిబ్బంది సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం రెండో రోడ్‌లోని మిత్రా హోటల్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న రోప్‌లైట్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు శ్రీనివాసులు, శేఖర్‌బాబు, టివి.చంద్రమోహన్ రెడ్డి, ఎంహెచ్ఒ గంగాధర్ రెడ్డి, వైసిపి నాయకుడు ఖాజా పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై ట్రైనీ కలెక్టర్ విచారణ

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచర్ల గ్రామం నుంచి స్పందన గ్రీవెన్స్‌కు అందిన ఓ ఫిర్యాదుపై ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్ గురువారం నాడు ఆగ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. తహశీల్దార్ ఉషారాణితో కలిసి అర్జీదారునితో మాట్లాడారు. ప్రస్తుతం ఎవరైతే సాగులో ఉన్నారో వారికి పట్టా ఇచ్చేలా అధికారులను ఆదేశించారు. ఇదే గ్రామంలో అన్నదమ్ముల మధ్య గల రస్తా వివాదంను పరిశీలించారు.

టిడ్కో గృహాల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న జితేంద్రగౌడ్

అసమర్థ వైసిపి ప్రభుత్వం గద్దె దిగాలి

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

గుత్తి : అసమర్థ పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వం గద్దె దిగిపోవాలని మాజీ ఎమ్మెల్యే, గుంతకల్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఆర్. జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని టిడ్కో గృహాలను గురువారం ఆయన పరిశీలించి గహాల వద్ద సెల్ఫీ దిగారు. గహ నిర్మాణాలపై ప్రభుత్వానికి సవాలు చేశారు. ఇల్లు లేని వారికి గహాలు నిర్మించాలనే ఉద్దేశంతో చంద్రబాబు హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తి చేశామన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పిన వైసీపీ గద్దెనెక్కి ప్రజా సమస్యలను విస్మరించిం దన్నారు. జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్లు గడిచినా 10 శాతం పనులు పూర్తి చేసి ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో వైసిపి ప్రభుత్వం విఫల మైందన్నారు. ఇకనైనా ప్రభుత్వం టిడ్కో గహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

గుత్తి : పట్టణంలోని చెరువు కట్ట సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గుంతకల్లు మండలం పాత కొత్తచెరువుకు చెందిన గోపాల్ ఆటో నడుపుతూ గుత్తికి వస్తుండగా చెరువు కట్ట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గోపాల్ తీవ్రంగా గాయపడగా స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

13న జాతీయ లోక్‌అదాలత్

గుత్తి : వచ్చే నెల 13వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి జి.కబర్ది తెలిపారు. గురువారం సాయంత్రం ఏడిజే కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి వి.విజయ్ కుమార్ రెడ్డి, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, న్యాయవాది ఫక్రూబాషా, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరులో చైన్‌స్నాచింగ్

యల్లనూరు : మండల కేంద్రమైన యల్లనూరులో గురువారం చైన్ స్నాచింగ్ సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నారాయణమ్మ ఉదయం వాకింగ్‌కు వెళ్లింది. పెట్రోల్ బంకు సమీపంలో హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ దుండగుడు ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

నేడు గూగూడులో వేలం

నార్పల : మండల పరిధిలోని గూగుడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన 5,000 కిలోల మిశ్రమ బియ్యం, 2,000 కిలోల చక్కెరను ఈ 21వ తేదీ ఆలయ ఆవరణలో వేలం వేనున్నట్లు కార్యనిర్వహణ అధికారి శోభ, పాలకవర్గం కమిటీ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ. 20,000 ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలం దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలకు లోబడి నిర్వహిస్తామని, వేలం పాటను రద్దు చేయడానికి, వాయిదా వేయడానికి అధికారులకు అధికారం ఉంటుందని తెలిపారు.

ఆధార్ స్పెషల్ క్యాంపుల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని వివిధ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంపును గురువారం ఎంపీడీవో యోగానందరెడ్డి పరిశీలించారు. ఆయన పుట్లూరు, తక్కలపల్లి, ఎస్.గూడూరు సచివాలయా లను సందర్శించి సిబ్బంది హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని ఆదేశించారు. అలా కాకుండా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కేయులో మొక్కలు నాటిన అధికారులు

అనంతపురం : ఎస్కేయూ కాలేజ్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ స్పెషల్ క్యాంపులో భాగంగా 5వ రోజైన గురువారం ఎస్కేయూ హెల్త్ సెంటర్, ఎస్కేయూ ఎంఎస్ఎస్ భవన్ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్య సౌమ్య, ప్రిన్సిపల్ డాక్టర్ జి.సోమశేఖర్, ఎస్కేయూ హెల్త్ సెంటర్ స్టాఫ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విజన్‌గల నాయకుడు చంద్రబాబు

పుట్లూరు : రాష్ట్రాభివృద్ధి విషయంలో విజన్‌గల నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టిడిపి నాయకులు తెలిపారు. మండల పరిధిలోని ఏ.కొండాపురం గ్రామంలో గురువారం టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు, నాయకులు రవిచంద్ర నాయుడు, పెద్దయ్య, రామాంజనేయులు, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మయ్య, సోమశేఖర్ నాయుడు, తీర్థమయ్య, భక్తవత్సల నాయుడు, రామాంజి, వెంకటయ్య, కుళ్లాయప్ప, ఆది, నరసింహ, జగదీశ్, ఉమేష్ పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యకోసం నడవాల్సిందే..

బస్సు సౌకర్యం లేని గ్రామాలు.. కాలినడకన వెళ్తున్న విద్యార్థులు..

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండల పరిధి లోని పలు గ్రామాల విద్యార్థులు హైస్కూల్ చదువు కోసం ప్రతి రోజూ కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో 9 జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉండగా 33 గ్రామాల నుంచి ప్రతి రోజూ సుమారు 4,000 మంది బాల, బాలికలు విద్యాభ్యాసానికి వస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి 3-9వ తరగతి వరకు చదివే విద్యార్థులు రోజూ పాఠశాలకు వస్తూ పోతూ ఉంటారు. అయితే చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మండే ఎండలోనే కాలినడకన పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరిలోని ఉన్నత పాఠశాలకు కురవల్లి, సిద్దరాంపురం గ్రామాల నుంచి దాదాపు 120 మంది, మల్లన్నగుడ్డం గ్రామానికి చెందిన 150 మంది పిల్లలు ప్రతిరోజూ నడిచి వెళ్లాల్సిందే. లింగదహాల్ ఉన్నత పాఠశాలకు రావాలంటే కోలగానహళ్లి

గోవిందవాడ గ్రామం నుంచి కందేపల్లికి నడిచి వెళ్తున్న విద్యార్థులు

గ్రామానికి 6 కి.మీ, కష్ణాపురం గ్రామానికి 3 కి.మీ, రంగాపురం క్యాంపునకు 3 కి.మీ దూరం ఉంటుంది. దర్గా హొన్నూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వన్నల్లి, చుట్టుపక్కల గ్రామాల నుంచి 5 కి.మీ నడిచి 100 మంది పిల్లలు వస్తారు. ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గౌనూర్ నుంచి 3 కి.మీ, బండూరు నుంచి 4 కి.మీ నడిచి 200 మంది పిల్లలు ప్రతిరోజూ వస్తారు. శ్రీధరఘట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సింగేపల్లి నుంచి 5 కి.మీ, ఉప్పరాల నుండి 3 కి.మీ. ఉంటుంది. ప్రతి రోజూ 160 మంది పిల్లలు పాఠశాలకు వస్తా రు. బొమ్మనహాల్ జడ్పీ హైస్కూల్ నుంచి అరేయ్ సముద్రం గ్రామానికి 7 కి.మీ, గుడిసెలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఎలన్జి 6 కి.మీ ఉండగా 100 మంది పిల్లలు వస్తారు. గోవిందవాడ గ్రామానికి కందేపల్లి నుంచి 6 కి.మీ, తారకపూర్ నుంచి 6 కి.మీ నడిచి విద్యార్థులు పాఠశాలకు వస్తుంటారు. ఆయా గ్రామాలకు బస్సుల సౌకర్యం లేకపోవడం, గ్రామం నుంచి మరో గ్రామా నికి మధ్య దూరం ఎక్కువగా ఉండడం, వేసవి కావడంతో విద్యార్థులు ఎండలోనే అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికా రులు స్పందించి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఖరీఫ్ సీజన్లో సాగు చేసే పంటలకు తక్కువ పెట్టుబడి వ్యయంతో అధిక దిగుబడులు వచ్చేలా రైతులకు సూచనలు ఇవ్వాలని రాయదుర్గం ఏడిఏ లక్ష్మానాయక్ సూచించారు. రాయదుర్గం మండల పరిధిలోని 74వ రైతు భరోసా కేంద్రంలో రాయదుర్గం, గుమ్మగట్ట, కణేకల్, డి.హీరేహాల్, బొమ్మనహాల్ మండలాల వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బందితో ఏడిఏ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌ను దష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం నుండి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపించాలన్నారు. వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించే విధంగా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం నుండి వ్యవసాయ యంత్ర సేవా కేంద్రాల ఏర్పాటుకు ఈ నెల 25 వరకూ గడువు ఉందన్నారు. పైలెట్ ట్రైనింగ్ కోసం గ్రామీణ ప్రాంతంలోని అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేయాలన్నారు. 14వ విడత పిఎం కిసాన్ కోసం ఈ కేవైసీ పూర్తి చేయాలన్నారు. నకిలీ మందులు విక్రయించకుండా దుకాణాలను పర్యవేక్షించే బాధ్యత వ్యవసాయ అధికారులదేనని స్పష్టం చేశారు. సమావేశంలో వ్యవసాయ అధికారులు మహేంద్ర, అహ్మద్‌బాషా, నిర్మల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థికసాయం

యాడికి : మండల కేంద్రంలోని కొండవీధికి చెందిన మాబుపీరా గత కొంతకాలంగా కిడ్నీ, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈయనకు అమెరికాలో స్థిరపడిన షబ్బీర్ అహమ్మద్ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. షబ్బీర్ సోదరుడు ఫరూక్ కుమారుడు మహమ్మద్ అప్సర్ చేతుల మీదుగా గురువారం దీనిని అందించారు.

అవినీతికి పాల్పడిన వారిని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఒటిఆర్‌ఐ ఫార్మసీ కళాశాలలో అవినీతికి పాల్పడిన డైరెక్టర్ దేవన్న, అసిస్టెంట్ రిజిస్టర్ లింగప్పలను వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృధ్వి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అనంతపురం జెఎన్‌టియు ఉపకులపతి రంగ జనార్ధన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

కేక్ కట్ చేస్తున్న వి.ప్రభాకర్ చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను అర్బన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు దూర దృష్టితో తెలుగు రాష్ట్రాల అభివద్ధికి కషి చేశారని కొనియాడారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత నాయకులు బంగినాగ ఆధ్వర్యంలో సాయిబాబా గుడిలో, పాలాభిషేకం, 73 టెంకాయలు కొట్టి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు దేవర్లమురళి, నగర అధ్యక్షుడు మారుతికుమార్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామియాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్.నాగరాజు, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, రాష్ట్ర నాయకురాలు తేజశ్విని, బంగినాగ, తెలుగుయువత సుధాకర్ యాదవ్, కూచిహరి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్ఈఓ జాఫర్ సూచించారు. విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామం లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు వేసవిలో తగిలే వడదెబ్బపై పాల్తూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ముందుగా సెంటర్‌లోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి పౌష్టికాహార పదార్థాలు కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు బాగా పెరుతుం డడం వల్ల ఆరుబయట ఆడుకోవడం, ఎండలో తిరగడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే చెప్పులు ధరించి గొడుగు తీసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దుర్గాదేవి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఎంపీహెచ్ఈఓ జాఫర్, ఏఎన్ఎంలు అనిత, కళావతి, పీహెచ్ఎన్ అరుణ, ఆశా వర్కర్లు గౌరీ, వాణి, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోండి

శింగనమల : ఉపాధి హామీ పనులకు వెళ్లి వడదెబ్బతో బుధవారం నాడు మృతి చెందిన కూలీ కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శింగనమల మండలం గోవిందరాజులపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పనికి వెళ్లి ఇమామ్ హుస్సేన్ అనే కూలీ వడదెబ్బతో మృతి చెందాడని చెప్పారు. కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలన్నారు. మూడు ఎకరాల ప్రభుత్వ సాగు భూమి, ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి సుంకన్న, అధ్యక్షులు ఎర్రిస్వామి, ఆంజనేయులు, కుళ్లాయప్ప రామకష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విడపనకల్లు మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య సూచించారు. విడపనకల్లు మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి అనంతరం రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కొత్తగా పాసు పుస్తకాలు చేసుకున్న రైతులు రైతు భరోసా పథకం లబ్ధి పొందేందుకు మీ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సిహెచ్‌సి గ్రూపులు ఏర్పాటు చేసి 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేస్తుందని, ఈ అవకాశాన్ని అన్ని గ్రామాల్లోని రైతులు ఐదు గురు సభ్యులతో గ్రూపులుగా ఏర్పడి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే మండల కేంద్రంలో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, రైతు భరోసా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-గుత్తి

పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో గ్రానైట్ శివ ఆధ్వర్యంలో గురువారం ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి సూచనతో 150 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, వైసీపీ సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో 17వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దస్తగిరి, సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, నాయకులు బేడల వెంకటరాముడు, రమణ, అన్సర్, కుమార్, డాక్టర్ వి.నాగేంద్ర, మధు, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి

మండల పరిధిలోని తొండపాడు-జక్కలచెరువు గ్రామాల మధ్య గురువారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలంలోని చందన గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(45) లారీ డ్రైవర్‌గా ఉంటూ జీవన సాగించేవాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై డ్రైవర్ వత్తిని వదిలేశాడు. బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చిన అతడు రైలు కింద పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం కోసం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రం వేములపాడు రోడ్డులో ఇసుకను అక్రమంగా తరలిస్తోన్న ఓ ట్రాక్టర్‌ను విజిలెన్స్ ఎస్ఐ ఫణీంద్రనాథ్ రెడ్డి గురువారం పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా రవాణా చేస్తుంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుత్ మోటారు చోరీ

ప్రజాశక్తి-గుత్తి

మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామంలో బుధవారం రాత్రి దుండగులు విద్యుత్ మోటారును ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద తాగునీటి పథకానికి సంబంధించిన విద్యుత్ మోటార్ కేబుల్ వైరు, పైపులను దుండగులు ఎత్తుకెళ్లారు. చోరీ ఘటనపై సీఐ ఎం.వెంకటరామిరెడ్డికి ఎంపీటీసీ చిన్న వీరన్నగౌడ్ ఫిర్యాదు చేశారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిందని, నూతన మోటారు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో చిత్రా శ్రీనివాసులు, ఈఓఆర్డీ శివాజీరెడ్డిలను ఎంపీటీసీ కోరారు.

ఉచిత వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి -అనంతపురం

రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో ఉచిత బలిజ కుల వివాహ పరిచయ వేదికను అనంతపురం శ్రీనివాసనగర్ బాలాజీ ప్రార్థన మందిరంలో ఈ నెల 30వ తేదీ నిర్వహిస్తున్నట్లు రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు పాములాయి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4-00 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. వధూవరులు 30-04-2023 తేదీ ముందుగా గానీ, ఆ రోజున గాని ఉదయం 8-00 గంటల నుంచి 12-00 గంటల వరకు వారి పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. 12 గంటల నుంచి రెండు గంటల వరకు వధూవరుల పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. అభ్యర్థులు తల్లిదండ్రులతో వారి బయోడేటా కార్డు సైజ్ ఫోటోతో హాజరు కావలన్నారు. ఎటువంటి కమీషన్లు లేకుండా ఉచిత మధ్యవర్తిత్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు

పజాశక్తి-అనంతపురం

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదవ రోజు ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం మండల పరిధిలోని వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి హైస్కూళ్లలో గురువారం పిచ్చి మొక్కలు తొలగించారు. అలాగే సక్ష్యం సంస్థ సహకారంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి(కడప) సౌజన్యంతో వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 38 మందికి శస్త్రచికిత్స అవసరమని కంటి వైద్య నిపుణులు వెంకటేష్, గురువయ్య తెలిపారు. కార్యక్రమంలో సక్ష్యం సభ్యులు ఆనంద్, నాగేంద్ర, సుధాకర్, అనిమేష్, వలంటీర్లు సాంబశివ, అభి,

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అశోక్, మునీశ్వర్, శివ, ముని, జ్ఞానేశ్వర్, వందన, నికిత, కార్తీక్, ప్రత్యూష, సుష్మ, అఖిల, మైత్రి, స్రవంతి, భావన, యమున, శాలిని, మురళీ, రమ్య, వర్షిత, భార్గవ్, నారాయణస్వామి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో సత్యసాయి తాగునీటి పథకం పైపులు శిథిలావస్థకు చేరుకొని నీరు వృథా అవుతుండడంతో ప్రజలు నీటి కోసం పడుతున్న కష్టాలను గుర్తించి నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ వీరాంజనేయులు, వైసిపి నాయకులు నాగప్ప గురువారం విలేకరులకు తెలిపారు. ఎండాకాలంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని నూతనంగా పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. సకాలంలో పైపులైన్ పనులు పూర్తిచేసి గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామనివారు పేర్కొన్నారు.

గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని 26 పాఠశాలలకు లైబ్రరీ బుక్స్ వచ్చాయని గురువారం ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. అందులో 5 హైస్కూళ్లు, 21 ప్రైమరీ, యుపి పాఠశాలలకు వచ్చాయని తెలిపారు. 'జగనన్న గోరుముద్ద' పథకంలో భాగంగా మండలంలోని 2,704 మంది పిల్లలకు స్టీల్ గ్లాసులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

అవార్డు అందుకుంటున్న సవేరా ఆసుపత్రి బృందం సభ్యులు

సవీరా ఆస్పత్రికి సౌత్‌జోన్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి ప్రతిష్ఠాత్మకమైన సౌత్ జోన్ 'ది కన్సార్టియం ఆఫ్ అక్రెడేటెడ్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్స్'(కాహో) అవా ర్డు దక్కింది. హైదరాబాద్‌లోని నోవా టెల్ కన్వెన్షన్ సెంటర్‌లో కన్సార్టియం ఆఫ్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్స్ ఏడో అంతర్జాతీయ సదస్సు జరిగింది. కిమ్స్ సవీరా ఆస్పత్రి సేవల్లో నాణ్యతకు పెద్దపీట వేసినందుకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఫిజికల్ ఆడిట్ స్కోర్లలో కనీసం 80శాతం సాధించిన ఆస్పత్రులకు ఎస్ సర్టిఫికెట్ ఇస్తారు. అయితే కిమ్స్ సవీరా ఆస్పత్రి 95శాతం స్కోరు సాధించి అన్ని విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచింది. దీంతో దక్షిణాది ప్రాంతానికి ఈ అవార్డు దక్కించుకొంది. తద్వారా భారతదేశం లో ఈ అవార్డు పొందిన 5 ఆస్పత్రుల్లో ఒకటగా నిలిచింది. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ "రోగులకు సురక్షిత, ఉత్తమ, నాణ్య మైన సంరక్షణను అందించడమే ఏ ఆసుపత్రికైనా లక్ష్యం. నోసోకోమియల్ ఇన్ఫెక్షన్లను నివారించడం సురక్షితమైన చికిత్స అందించడంలో అతిపెద్ద సవాలు.. ఆస్పత్రిలో ఇన్ఫెక్షన్ రేటును తగ్గించడంలో సీఎస్ఎస్‌డీ పోషించే కీలక పాత్రను మరీ ఎక్కువగా చెప్పలేం.. అయినా ఇది పొందవల సినంత గుర్తింపు పొందదు" అన్నారు. క్వాలిటీ, పేషెంట్ సేఫ్టీ విభాగాధిపతి డాక్టర్ రవిశంకర్ మీడియాతో మాట్లాడుతూ "సీఎస్ఎస్‌డీ విభాగం పరిధి గతంలో ఆటోక్లేవ్ యూనిట్ నుంచి బాగా విస్తరించిందన్నారు. స్టెరైల్ పరికరాలను సరఫరా చేయడంలో అంకిత భావంతో కూడిన పనితీరు ఉండేలా ఈ విభాగం జాగ్రత్త వహి స్తుందన్నారు. తద్వారా ఆస్పత్రిలో ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా చూడటంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తుంది" అని వివరించారు. అవార్డు అందుకున్న బృందంలో కిశోర్‌రెడ్డి (ఎండీ), డాక్టర్ రవిశంకర్, ఇమ్రాన్, రామాంజనేయులు ఉన్నారు.

మోడీ వ్యతిరేక విధానాలపై

వామపక్షాల ప్రచార భేరి

ప్రజాశక్తి-ఆత్మకూరు

పోస్టర్లు విడుదల చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ ప్రచురించిన ప్రచార భేరి గోడపత్రికలను గురువారం ఆత్మకూరులో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో మోడీ సర్కార్ ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. మోడీ దుర్మార్గాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి నిర్బంధిస్తుందన్నారు. మోడీ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుండి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రామయ్య, వలి, జయమ్మ, వెంకటమ్మ, సరస్వతమ్మ, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, రామకష్ణ, వెంకటనారాయణ పాల్గొన్నారు

గుంతకల్లులో పేకాటజూదరులు అరెస్టు

రూ.9.19 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని తిలక్ నగర్ 60 అడుగుల రోడ్డు సమీపంలోని ఓ ఇంట్లో జరుగుతున్న భారీ పేకాట కేంద్రంపై పోలీసులు గురువారం సాయంత్రం దాడులు చేశారు. అందిన సమాచారం మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు, రెండవ పట్టణ పోలీసులు ఆ స్థావరంపై మెరుపు దాడులు చేసి పేకాట ఆడుతున్న 36 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.9.19 లక్షలు నగదు, 13 ద్విచక్ర వాహనాలు, 30 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. ఈ జూదకేంద్రం ఆ వార్డు వైసిపి నాయకుని కుటుంబ సభ్యుడు వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగినట్లుగా తమ విచారణలో తేలిందన్నారు. పట్టుబడిన వారిలో గుంతకల్లు పట్టణం, మండలానికి చెందిన వారు 15 మంది ఉండగా మిగిలిన వారు ఉరవకొండ, కర్నూలు జిల్లా గ్రామాల వారు ఉన్నారన్నారు. వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్త-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని 21వ వార్డులో పింజరి హుస్సేన్‌పీరా సాబ్(55) గత కొద్ది నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతూ మంగళవారం సాయంత్రం మతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ వార్డు సభ్యులు డిష్ గోవింద, డాక్టర్ మల్లికార్జున మతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందప్ప, సూరి, నగేష్, నరేష్, రవి పాల్గొన్నారు.

In the Court of the Prl. District Judge: Anantapuramu

T.R.O.P.No.32/2022

Between:
Ambati Prakash ...Petitioner
And
Ambati Chalapathi and Others ...Respondants

NOTICE TO RESPONDANT No.3

R3: E.Pushpavathamma W/o Vekata Swamy, Trader, Residing at D.No.1-325, Dwaraka Nagar, Anantapuramu Dist.

పై నెంబర్ కేసులో 3వ రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం తేది:21-04-2023వ తేదీ ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

N.R.K. Mohan, Advocate
Anantapuramu, Cell:9440787100.

డాక్యుమెంటు పోయినది

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింటు కె.జితేంద్ర తండ్రి కె.మనోహర్, డోర్‌నెం.12-3-310, 7వ క్రాస్, సాయినగర్, అనంతపురము టౌన్, అనంతపురము జిల్లా, సెల్: నెం.7337229729, వారి తల్లి గారు అయిన విజయగారి పేరిట గల డాక్యుమెంటు నెం.673/1977 గల ఒరిజినల్ డాక్యుమెంట్లు 15-04-2023వ తేదిన అనంతపురము రూరల్ మండలం, కళ్యాణదుర్గం రోడ్డు, రాజా హోటల్ దగ్గర గల జిరాక్స్ సెంటర్ నందు జిరాక్స్ చేయించుకోడానికి వెళ్లినపుడు మిస్ అయినవి. పై డాక్యుమెంట్లు ఎవ్వరికైననూ దొరికినచో నాకు గానీ, నా క్లయింటుకు గాని తెలియజేయగలరు.

షెడ్యూలు:

అనంతపురము రి.డి. అనంతపురము సబ్॥డి॥కు చేరిన అనంతపురము టౌన్‌లోని సాయినగర్‌లో స్వాధీనానుభవంలో యున్న ఆస్తి వివరం:

Ward	T.S.No.	Plot No.
పాత-4	2141/2	18
క్రొత్త-8		
సరిక్రొత్త-12		

ఈ ప్లాటుకు చెక్కుబంది: తూర్పు:డా॥విజయకుమార్ గారి ప్లాటు, దక్షిణం: నరసింహారెడ్డి గారి ఇల్లు, పడమర: బి.నరసింహులు గారి ఇల్లు, ఉత్తరం: రోడ్డు, ఈ మధ్య గల తూ॥ప॥33 అడుగులు మీటర్లు 10.00, ఉ॥ద॥80 అడుగులు మీటర్లు 24.38 గల ప్లాటు.

Smt. Padmanarayana Reddy, Advocate
Ananthapuramu, Cell: 8341263618.